

మాటల్లో దించి.. ముంచేస్తారు





- రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- మూడునెలల్లో 2,685 ఫిర్యాదులు
- రూ.48 కోట్లకు పైగా స్వాహా

కడప క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోను ఇప్పుడు ప్రతి ఒక్కరి వద్దా ఉంది. కొందరైతే రెండుమూడు ఫోన్లు ఉపయోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోను వాడేవారిని సైబర్ నేరగాళ్లు స్మార్ట్‌గా మాటల్లో దించి డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది మూడునెలల్లోనే 2,685 ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు రూ.48 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ఎక్కువ మోసాలు

ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ఆశ చూపుతున్నారు. వారి మాటలు నమ్మి పలువురు అత్యాశతో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తున్నారు. ఇలా మూడు నెలల్లోనే రూ.25 కోట్లకు పైగా డబ్బులు కొట్టేశారు. దీంతో 1200 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడపకు చెందిన వ్యక్తి నుంచే ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.14 కోట్లు వసూలు చేశారు. జాబ్‌ఫ్రాడ్ పేరుతో రూ.17 కోట్లు వసూలు చేశారంటూ 124 ఫిర్యాదులు వచ్చాయి. లోను ఫ్రాడ్ వల్ల రూ.63 లక్షలు పోగొట్టుకున్నారు. ఫిషింగ్ పేరుతో 339 ఫిర్యాదులు రాగా, రూ.13 కోట్లు స్వాహా చేశారు. ఓఎల్ఎక్స్ కస్టమర్‌కేర్, బిట్‌కాయిన్, హనీ ట్రాక్ పేర్లతో చిన్న చిన్న మొత్తాల్లో లాగేశారు. ఇక డెబిట్, క్రెడిట్ పేర్లతో రూ.2కోట్లకు పైగానే స్వాహా చేశారు. దీనిపై 329 ఫిర్యాదులు వచ్చాయి. ఇతర పేర్లతో మోసపోయిన వారి ఫిర్యాదులు 295 రాగా రూ.36లక్షలకు పైగానే వీరి డబ్బు పోయింది. మొత్తం ఈ మూడునెలల్లో సైబర్ నేరగాళ్లపై వచ్చిన 2,685 ఫిర్యాదులకు గాను రూ.48 కోట్లకుపైగా డబ్బులు పోగొట్టుకున్నారు. బ్రహ్మంగారి మఠానికి చెందిన ఓ వ్యక్తికి కరెంటు అధికారుల పేరుతో ఫోన్లు చేశారు. మీ బిల్లులు చెల్లించకుంటే మీటరు కట్ చేస్తామంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. మీటరు కొనసాగాలంటే మీకు వచ్చే ఓటీపీ నెంబరు చెప్పాలన్నారు. అతను తనకు వచ్చిన ఓటీపీ నెంబరు చెప్పడంతో దాదాపు రూ.30వేలకు పైగానే సైబర్ నేరగాళ్లు కొట్టేశారు.

వివరాలు చెప్పరాదు

సైబర్ నేరగాళ్లు ఏదోఒక రూపంలో మోసాలకు పాల్పడుతూ మన దగ్గర ఉన్న డబ్బును కొట్టేస్తున్నారు. ఎక్కడో ఉండి ఇక్కడున్న వారికి ఫోన్లు చేసి మరీ వివరాలు తెలుసుకుని మన అకౌంటులో ఉన్న డబ్బులు కాజేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ల పట్ల స్పందించకూడదు. ఏ అధికారీ ఫోను చేయరు. ఒకవేళ అలా ఏదైనా ఫోను వస్తే సంబంధిత కార్యాలయానికి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోవడం మంచిది. మన వివరాలు ఇతరులకు ఇచ్చామా, మన ఖాతాలో ఉన్న సొమ్ము ఖాళీ కాక తప్పదు.

పాతకడప చెరువు ఆక్రమణ

- ఆగని వైసీపీ నేతల భూదందా
- అడ్డుకున్న టీడీపీ నేతలు



అధికారులు సీజ్ చేసిన ఎక్సకవేటర్, టిప్పర్

కడప కలెక్టరేట్, మే1 (ఆంధ్రజ్యోతి): పాతకడప చెరువు రోజురోజుకు ఆక్రమణలకు గురవుతోంది. దాదాపు 387 ఎకరాల విస్తీర్ణం గల పాతకడప చెరువులోని 4 ఎకరాల స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు తమకు పట్టా ఉందంటూ వెంచర్లు వేసేందుకు సిద్ధమయ్యారు. గ్రీన్‌ఫీల్డ్, బఫర్‌జోన్ పరిధిలో ఈ భూమి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ వెంచర్ వేయకూడదు. అయితే కొందరు వైసీపీ నేతలు ఇక్కడ వెంచర్ వేసేందుకు వారం రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళలో దాదాపు 200 టిప్పర్ల గ్రావెల్ తరలించారు. విషయం తెలుసుకున్న పాతకడప చెరువు నీటి సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, పాత కడప మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి, 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చైతన్య, దేవుని కడప నేతలు శంకర్, చెన్నంశెట్టి మురళీ, శ్రీధర్, నగేశ్, రైతులు పెద్ద ఎత్తున గురువారం పాతకడప చెరువు వద్దకు చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. పాతకడప చెరువులో కేసీ కెనాల్‌కు ఆనుకొని తమకు పట్టా భూమి ఉందని కొందరు వైసీపీ నేతలు గొడవకు దిగారు. దీంతో వెంటనే కడప ఇన్‌చార్జి తహశీల్దారు శివారెడ్డికి, నగర కమిషనర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. వారు రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపి చెరువులో అక్రమ నిర్మాణాలు చేసేందుకు సిద్ధంగా ఉన్న ఎక్సకవేటర్‌ను, టిప్పర్‌ను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయం వద్దకు తరలించారు.

ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ.. దేవుని కడపకు వెళ్లే మత్స్య శాఖ పరిధిలోని రోడ్డులో ఇష్టారాజ్యంగా గ్రావెల్‌తో టిప్పర్లు తిరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పాతకడప చెరువును ఆక్రమించి గతంలో అగాడి ప్రాంతంలోని వైసీపీ బడానేతల అండతో అడ్డగోలుగా బ్రిడ్జీలు నిర్మించి వెంచర్లు వేశారన్నారు. అప్పుడు అడ్డుకున్నందుకు తమపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా చెరువు ఆక్రమణలో పాతకడపకు చెందిన ఓ వైసీపీ ముఖ్య నాయకుడు, మరికొందరి పాత్ర ఉందన్నారు. కలెక్టర్ వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. పాతకడప చెరువులో ఆక్రమణలపై ఇన్‌చార్జి తహశీల్దారు శివారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పాతకడప చెరువులో మట్టి తోలుతున్నట్లు సమాచారం మేరకు రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. సర్వే నెంబరు 60/4, 6, 7 లో వెంచర్‌కు చదును చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఆ సర్వే నెంబరు పట్టా భూమిగా ఉందని, రికార్డులను పరిశీలించిన మీదట చర్యలు తీసుకుంటామన్నారు.



చెరువు ఆక్రమణకోసం తోలిన గ్రావెల్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, రైతులు

‘చలో అమరావతి’కి తరలిన బస్సులు



జమ్మలమడుగులో చలో అమరావతి బస్సులను ప్రారంభిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటనకోసం ‘చలో అమరావతి’ కార్యక్రమానికి బస్సులు తరలి వెళ్లాయి. వీటిని గురువారం రాత్రి జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి డ్వాక్రా సంఘాల వారు, మెప్మా ఆర్పీలు, ఇతరులు కలిసి ఈ కార్యక్రమానికి వెళుతున్నారు. ఇందులో భాగంగా జమ్మలమడుగు నుంచి తరలుతున్న బస్సులను ఆర్డీవో ప్రారంభించి అక్కడికి వచ్చిన అధికారులతో జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. జమ్మలమడుగు నుంచి మూడు బస్సులు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల నుంచి ఒక్కో బస్సును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పురుషోత్తం రెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, తహశీల్దారు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవోలు రామచంద్రారెడ్డి, సైదున్నీసా, మండల మహిళా సమాఖ్య అధికారులు గురుకుమార్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ

కడప క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు సీఐలను బదిలీచేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీచేశారు. మైదుకూరు సీఐ శ్రీహరి కడప సీసీఎస్-2 సీఐగా, ఇక్కడున్న సీఐ రెడ్డప్ప కడప తాలుకా సీఐగా బదిలీ అయ్యారు. తాలూకా సీఐ వెంకటేశ్వర్లును వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ రమణారెడ్డి మైదుకూరు అర్బన్ సీఐగా, అన్నమయ్యజిల్లాలో వీఆర్‌లో ఉన్న రియాజ్ అహ్మద్ ఫ్యాక్షన్‌జోన్ సీఐగా బదిలీ అయ్యారు. వీఆర్ కడపలో ఉన్న వెంకటకుమార్‌ను ఫ్యాక్షన్ జోన్ కడప సీఐగా బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే సంబంధిత స్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు



శివపార్వతుల కల్యాణం సందర్భంగా మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

వల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అటు కొండపైన, ఇటు దిగువన వివిధ పూజలు, జపాలు, హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే గ్రామంలోని వైద్యనాథేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. ముందుగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణవేదికపై కొలువుదీర్చారు. గణపతిపూజ నిర్వహించి పుణ్యాహవచనం చేశారు. అనంతరం వేదపండితులు కల్యాణ ఘట్టం ముగించారు. కల్యాణోత్సవానికి పుష్పగిరి పీఠాధిపతులు విద్యానృసింహ భారతిస్వాముల వారు హాజరయ్యారు. సాయంత్రం వేళ కొండపై శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ



పింఛన్ల పంపిణీని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి సౌరభ్ గౌర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ప్రత్యేక అధికారి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ తనిఖీ చేశారు. గురువారం నగరంలోని సున్నపురాళ్లపల్లెలో పింఛన్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీ ఎలా జరుగుతుందని ఆరా తీశారు. పంపిణీలో ఏమైనా అలసత్వం జరుగుతుందా, ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయా అని సిబ్బందిని అడిగి కనుక్కున్నారు. దీంతో పాటు పౌరసరఫరాలకు సంబంధించి నిత్యావసర సరుకులు అందుతున్నాయా లేదా అనే అంశంపై ఆయన ఆరాతీశారు. పింఛన్ల పంపిణీ తనిఖీలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఏపీడీ ప్రసాద్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. గురువారం ఉదయం నుంచి జిల్లాలో పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ సిబ్బంది మానిటరింగ్ చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో 94 శాతం ప్రగతిని సాధించారు.

ఆదుకోని వాతావరణ బీమా

- పెనుగాలులకు ఏటా నష్టపోతున్న అరటి రైతులు
- నష్టం ప్రామాణికంగా పరిహారం ఇవ్వాలి
- రైతుల డిమాండ్

ప్రతి సంవత్సరం పెనుగాలులు, వడగండ్ల వర్షానికి అరటిచెట్లు నేలకొరిగి తీవ్రంగా నష్టపోతున్నా రైతుకు మాత్రం పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు. మార్చి, ఏప్రిల్, మే నెలలో పెనుగాలులు రావడం అరటిచెట్లు నేలకొరగడం పరిపాటిగా మారింది. నష్టపోయిన తర్వాత అరటి రైతులకు బీమా మాత్రం మంజూరు కాదు. దీనికి కారణం లోపభూయిష్టంగా ఉన్న వాతావరణ బీమా నిబంధనలు.



గాలులకు నేలకొరిగిన అరటి (ఫైల్ ఫొటో)

లింగాల, మే 1(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో సుమారు 22వేల ఎకరాల్లో.. ఒక్క లింగాల మండలంలోనే 12వేల ఎకరాల్లో అరటి సాగవుతోంది. ఎకరాకు రైతులు రూ.2లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ప్రతి సంవత్సరం సాగువిస్తీర్ణం పెరుగుతోంది. అదే సమయంలో రైతుల్లో ఆందోళనా పెరుగుతోంది. వేసవి వచ్చిందంటే చాలు పెనుగాలులు రైతులను వణికిస్తాయి. మార్చి 22వ తేదీన వీచిన పెనుగాలులకు 70 హెక్టార్లు, ఏప్రిల్ 14న 240 హెక్టార్లలో అరటి నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయినపుడు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ మంజూరు చేస్తోంది. తప్ప బీమా ఇవ్వడం లేదు.

వాతావరణ బీమాలో మార్పులు చేయాలి

అరటి పంటకు ఖరీఫ్‌లో వాతావరణ ఆధారిత బీమాను ప్రభుత్వం జూలై నుంచి మే నెల వరకు అమలు చేస్తోంది. వాతావరణ బీమాలో నిబంధనలు రైతులకు ప్రతికూలంగా ఉన్నాయి. అరటి రైతుకు బీమా మంజూరు కావాలంటే నష్టం జరిగినపుడు గాలి 50, 60, 70 కి.మీ వేగంతో వీచినట్లు రెఫరెన్స్ వెదర్ స్టేషన్‌లో నమోదు కావాలి. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో దిగుబడులు చేతికందుతాయి. ఆ సమయంలో 20, 30 కి.మీ వేగంతో గాలి వీస్తే చాలు.. అరటిచెట్లు నేలకొరుగుతాయి. దీంతో నిబంధనల ప్రకారం రైతులకు బీమా మంజూరు కాదు. రైతులకు న్యాయం జరగాలంటే వాతావరణ బీమా నిబంధనలలో సవరణలు చేయాలి. గాలి వేగం 20, 30, 40 కి.మీగా మార్పు చేయాలని రైతులు కోరుతున్నారు.

నష్టాన్ని ప్రామాణికంగా తీసుకోవాలి

పెనుగాలులకు జరిగిన నష్టం క్షేత్రస్థాయిలో కంటికి కనిపిస్తున్నా రైతులకు మాత్రం బీమా మంజూరు కాదు. నష్టం జరిగినపుడు రాజకీయనాయకులు పరామర్శించడానికి వస్తారు. అధికారులు నష్టం అంచనా వేయడానికి వస్తారు. పెట్టుబడి రాయితీ మంజూరుతో సరిపెడతారు. నష్టాన్ని ప్రామాణికంగా తీసుకుని బీమా మాత్రం మంజూరు చేయరు. ప్రతి ఏడాది జరుగుతున్నదిదే. సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని నాయకులు ఎవరూ ప్రయత్నించడం లేదు.

మరిన్ని రెఫరెన్స్ వెదర్ స్టేషన్లు కావాలి



లింగాలలో ఉన్న రెఫరెన్స్ వెదర్ స్టేషన్

లింగాల మండలంలో లింగాల, ఇప్పట్ల, మురారిచింతల గ్రామాలలో రెఫరెన్స్ వెదర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్ల పనితీరు అంతంతమాత్రంగా ఉంది. వీటిని ఆధునికీకరించడంతో పాటు మండలంలో మరికొన్ని రెఫరెన్స్ వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఒక్కోసారి పెనుగాలులు మండల వ్యాప్తంగా కాకుండా రెండుమూడు గ్రామాలకే పరిమితం అవుతాయి. అటువంటి సమయంలో ఎక్కువ స్టేషన్లు ఉంటే రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉంది. నిబంధనల పేరిట తప్పించుకోకుండా నష్టం జరిగినపుడు బీమా మంజూరు అయ్యేలా నేతలు తమకు భరోసా ఇవ్వాలని అరటి రైతులు కోరుతున్నారు.

బీమా నిబంధనలు సవరించాలి



2.75 ఎకరాల్లో అరటి సాగుచేశాను. పెట్టుబడి సుమారు రూ.5లక్షలు అయింది. మార్చి నెల 22న వీచిన పెనుగాలులకు అరటి చెట్లు మొత్తం నేలకూలాయి. ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని ప్రామాణికంగా తీసుకుని బీమా మంజూరు చేయాలి. ప్రతి సంవత్సరం నష్టం జరిగినపుడు పెట్టుబడి రాయితీ మంజూరు చేస్తారు. బీమామాత్రం మంజూరు చేయరు. వాతావరణ బీమా నిబంధనలు సవరించాలి.

- కేతిరెడ్డి వెంకటరెడ్డి, అరటి రైతు, పార్నపల్లె, లింగాల మండలం

హెక్టార్‌కు రూ.20వేల ఆర్థిక సాయం : ఎంపీ



పులివెందుల, మే 1 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలో గాలివానకు దెబ్బతిన్న అరటితోటల రైతులను ఆదుకునేందుకు వైసీపీ తరపున హెక్టారుకు రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల గాలివా నకు లింగాల మండలంలో దాదాపు 630 మంది రైతులకు సంబంధించిన అరటితోటలు దెబ్బతిన్నాయన్నారు. వీరి తోటలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించి రైతులను పరామర్శించారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వైసీపీ తరపున నష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందిస్తామని జగన్ ప్రకటించారన్నారు. ఈ మేరకు హెక్టార్‌కు రూ.20వేల చొప్పున 630 మంది రైతులకు రూ.1.30కోట్లు ఆర్థికసాయం అందిం చేందుకు జగన్ నిర్ణయించు కున్నారన్నారు. వారం రోజుల్లో అందరికి డీడీలు అందిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే కళ్లుతెరిచి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నెలకిందటి వరకు అరటికి మంచి ధర ఉండేదన్నారు. కానీ ఇపుడు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కోల్డ్ స్టోరేజీ ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, లింగాల మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ ఇచ్చే పరిహారం కంటితుడుపు చర్య : బీటెక్ రవి



పులివెందుల, మే 1 (ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబాన్ని ప్రతి ఎన్నికల్లో గెలిపిస్తున్నది లింగాల మండలమే అని అలాంటి మండలంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా అరటి పంటకు నష్టం వాటిల్లితే హెక్టార్‌కు రూ.20 వేల ఇస్తామని జగన్ చెప్పడం కంటితుడుపు చర్య అని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ఇప్పుడు చేసిన ఆర్థిక సాయం కూడా లిక్కర్‌లో దోచేసిందేనని ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపో యిన అరటి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. హెక్టార్‌కు రూ.35వేలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చె న్నాయుడు నిర్ణయించారన్నారు. దీనితో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మొక్కలు నాటుకునేం దుకు రూ.75 వేలు ఇచ్చేందుకు నిర్ణయించా రన్నారు. గాలి కారణంగా తోటలు నేలవాలితే గాలి వేగాన్ని బట్టి ఇన్సూరెన్స్ వస్తుందనే నిబంధన ఉందన్నారు. అయితే వెదర్ స్టేషన్‌ల నిబంధనలు కాకుండా ప్రాక్టికల్‌గా జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులను ఆదుకోవాలని జిల్లా అధికారులను కోరామన్నారు. త్వరలోనే రైతులకు నష్టపరిహారం అందుతుందన్నారు. పులివెందులలో అరటి గోడౌన్‌ను వినియోగంలోకి తెచ్చి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లిం గాల మండల నాయకులు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

‘బీజేపీ నాయకుల దాడి పిరికిపంద చర్య’

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, పీసీసీ అధ్యక్షురాలు, కాంగ్రెస్ నాయకులపై కొందరు బీజేపీ నాయకులు,కార్యకర్తలుకోడగుడ్లతో, టమోటాలతో దాడి చేయడం అప్రజాస్వామికం, పిరికిపంద చర్య అని కాంగ్రెస్ ముఖ్య అధికార రాష్ట్ర ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2015 అక్టోబరు 22న విజయదశమి రోజున ఉద్దండరాయునిపాలెం వద్ద ప్రధాని నరేంద్రమోదీ రాజధాని అమరవతికి శంఖుస్థాపన చేశారన్నారు. పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయన్నారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తే కాంగ్రెస్ నాయకులపై దాడి చేశారన్నారు. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రం సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా బుధవారం గోడకూలి 7 గురు భక్తులు చనిపోవడం విషాదకరమని తులసిరెడ్డి అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కారకులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం



సీకేదిన్నె, మే 1 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరులో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. పురాతన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి అభిషేకం నిర్వహించి అనంతరం కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో కోలాటంతో సందడి చేశారు. కల్యాణ మహోత్సవాన్ని, గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా మధుసూదన్‌రావు

కమలాపురం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా మధుసూదన్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడున్న న్యాయమూర్తి లావణ్య గుంటూరు జిల్లా నరసరావుపేట కోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో న్యాయమూర్తిగా మధుసూదన్‌రావు బాధ్యతలు చేపట్టారు.

కడప వన్‌టౌన్ ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి

కడప క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ-2గా ప్రతాప్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్‌ఐగా జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత కల్పిస్తామని, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచుతామన్నారు.

వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ చట్టాన్ని రద్దు చేయాలి

కడప మారుతీనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్‌చట్టాన్ని తెరపైకి తీసుకురావడం బాధాకరమని తక్షణమే రద్దుచేయాలని పలు పార్టీల, ప్రజాసంఘాల, మత పెద్దలు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తక్షణమే ఆ నల్ల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున నిరసన చేపడతామన్నారు. కాగా ఈ నెల 4న కడపలో ఇండియా, ముస్లిం పర్సనల్ లాబోర్డు ఆధ్వర్యంలో లాంగ్‌మార్చ్ (భారీర్యాలీ)నిర్వహిస్తున్నావన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు సలావుద్దీన్, మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా, నగరమేయరు సురేశ్‌బాబు, డిప్యూటీ మేయరు నిత్యానందరెడ్డి, మత పెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతికి తరలివెళ్లిన టీడీపీనాయకులు



లింగాల, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి పనులను పునః ప్రారంభిం చేందుకు శుక్రవారం రాజధాని అమరాతికి ప్రధాని నరేంద్రమోదీ వస్తు న్నారు. ఈ సందర్భంగా అమరావతిలో ఏర్పాటుచేస్తున్న భారీ బహిరంగ సమావేశంలో పాల్గొనేందుకు లింగాల మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు గురువారం బస్‌లో అమరావతికి బయలుదేరారు. టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి జండా ఊపి ప్రారంభించారు.

సీకేదిన్నె..: అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి చింతకొమ్మదిన్నె మండలం నుంచి బస్సుల్లో ప్రజలు బయల్దేరి వెళ్లారు. ఎంపీడీవో కుళాయి బాబు, టీడీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మోహన్‌బాబు బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు, ప్రజలు కార్యక్రమానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఏపీఎం రాజు, ఆర్‌ఐ ఆదిరాజు, టీడీపీ నాయకులు మహేష్‌రెడ్డి, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్ చేస్తున్న బాలకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోన ఎనిమిదో డివిజన్ టీడీపీ నాయకుడు బాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం కడప ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణారెడ్డికి టీడీపీ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, సూర్యనారాయణ, పసుపులేటి మనోజ్, ఎద్దుల శంకర్ కృష్ణారెడ్డి, జహరుల్లావల్లి, చైతన్యరెడ్డి, వివేకానందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కొండయ్య, శివారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి ఒడిలో వెయ్యినూతుల కోన

4 నుంచి 14వ తేదీవరకు బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనృసింహస్వామి ఆలయం

పెండ్లిమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి):ప్రసిద్ధ లక్ష్మీ నృసింహస్వామి వెలసిన పుణ్యక్షేత్రాలలో వెయ్యి నూతు లకోన ఆలయం ఒకటి. ఈ క్షేత్రంలో కాకులు,గద్దలు సంచరించవు. ఈ క్షేత్రం పెండ్లిమర్రి మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలో వెలసింది. చిన్న దాసరిపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో 1000నూతులు ఉన్న క్షేత్రం కావడంతో వెయ్యినూతులకోనగా ప్రసిద్ధి చెందింది.

4 తేదినుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు..: మే నెల 4వ తేదీనుంచి 14వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పిన్నపాటి నరసింహ హరిప్రసాద్ తెలిపారు.

పురాణగాథ..: త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు అరణ్య వాసం చేస్తున్న సమయంలో దండ కారణ్యంలో ప్రవేశించినపుడు సీతాదేవి ఒడిలో తల వంచి సేదతీరుతుండగా కాకా సురుడు అనే రాక్షసుడు పండు అని భ్రమించి సీతాదేవి తొడను ముక్కుతో పొడిచాడట.అది చూసిన రాముడు కోపంతో కాకాసురునిపై బ్రహ్మాస్త్రం సంధించాడట. అప్పటినుంచి ఈ ఆలయ పరిసరాల్లో కాకులు, గద్దలు సంచరించవని పురాణగాథ.

కోరినకోర్కెలు తీర్చే కొంగుబంగారం..: ఈ క్షేత్రానికి వచ్చిభక్తులు కోనేటిలో మునిగి స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి పల్లకీని మోస్తే మనసులో అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఉత్సవాల రోజు కోనేర్లలో చక్కెర స్నానం చేస్తే పాపకర్మలు తొలగి పోతాయని భక్తుల నమ్మకం.

ఆలయ చరిత్ర..: విజయనగర రాజుల కాలంలో ఈ ఆలయం వెలసినట్లు ఇక్కడి శాసనాలు వివరిస్తు న్నాయి. శ్రీకృష్ణ దేవరాయ కాలంలో సాళువ మంగ రాజు తన తల్లి గుర్తుగా వెయ్యినూతులకోన క్షేత్రం లో లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని నిర్మించాడు. అచ్యుతదేవ రాయలు ఆలయాన్ని దర్శించి 27 ఎకరాల భూమిని మాన్యంగా ఇచ్చారు. తాళ్లపాక అన్నమాచార్యులు స్వామిని దర్శించి 10కి పైగా సంకీర్తనలు రచించారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు పూజారులుగా, వంశ పారంపర్య ధర్మకర్తలుగా పిన్నపాటి వంశీయులు నిత్యం పూజలు,నైవేద్యం కొనసాగిస్తున్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ..: ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి హరిప్రసాద్ జర్మనిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ 2006లో లక్ష్మీదేవి ఆల య జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టి 2007 సంవత్సరంలో పూర్తిచేశారు.2009లో నృసింహస్వామి ఆలయ పున నిర్మాణం 2.50కోట్లతో చేపట్టి పూర్తి చేశారు.అద్భుతమైన శిల్పసౌందర్యం ఉట్టిపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు. ప్రకృతి అందాల నడుమ వెలసి కోరిన కోర్కెలు తీర్చు తూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



స్వామివారి మూలవిరాట్

ఘనంగా మేడే వేడుకలు



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కడప సెవెన్ రోడ్స్, మే 1 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టిలో భాగస్వామ్యం అయిన కార్మికులకు కార్పొరేట్ సంపద పునఃపంపిణీ చేసి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్‌చేశారు. గురువారం మేడే సందర్భంగా తెలుగు గంగ కార్యాలయం నుంచి కార్మికులు మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్లలో యూనియన్ కార్యాలయం చేరుకొని ఏఐటీయూసీ పతాకాన్ని ఈశ్వరయ్య ఆవిష్కరించారు. కగా ఆర్‌సీపీ ఆధ్వర్యంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలోని ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఏఐటీయూసీ కడప నగర సమితి ఆధ్వర్యంలో కడప నగరంలో 15సెంటర్లలో మేడే దినోత్సవం ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్), సీపీఎం జిల్లా కార్యాలయం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ సీపీఎం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సాయంత్రం సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడపకార్పొరేషన్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు కార్మిక సంఘాల ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే నగరంలోని విద్యుత్ భవన్,ట్రాన్స్‌కో కార్యాలయాల ముందు జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రామలింగారెడ్డి,ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప రూరల్..: కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం న్యాయసేవా సదన్‌లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్. ప్రసాద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద మేడే సందర్భంగా యూటీఎఫ్ జెండాను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహ రావు, జిల్లాకార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. చింతకొమ్మదిన్నె మండలంలోని ఇందిరానగర్‌లో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రజెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. అదే విధంగా మండలంలోని ఆజాద్‌నగర్, భగత్ సింగ్‌నగర్ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి.

వేంపల్లె..: కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. వేంపల్లెలో మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ఉపాధ్యక్షులు చల్లా బాలాజీ, మండలాధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.కాగా పారిశుధ్య కార్మికులను కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, కాగ్రెస్ నాయకులు సత్కరించారు.

ఎస్‌ఐని సన్మానించిన టీడీపీ నాయకులు



చక్రాయపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట ఎస్‌ఐగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన కృష్ణయ్యకు టీడీపీ నాయకుడు లోమడ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, దండలు వేసి కేక్‌లు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, మండల బీసీ నాయకులు రమేష్, శంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, సాయిరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

పెండ్లిమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేయడం వలన మంచి దిగుబడులు వచ్చి అధిక లాభాలు పొందవచ్చని ఏవో ఓబులేసు తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలూరులో గురువారం ద్రవ జీవామృతాన్ని రైతులతో వ్యవసాయ అధికారులు చేయించారు.

4న నీట్ యూజీ పరీక్షలు: కలెక్టర్

కడప కలెక్టరేట్, మే1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 4న నీట్ యూజీ 2025 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్టీఏ సూచించిన నిబంధనలు తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్ర కటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 8 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఇందులో ప్రొద్దుటూరు-2, కడపలో 6 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించే ముందు నిబంధనలకు లోబడాలన్నారు. ప్రింటింగ్ పేపర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించడం జరిగిందన్నారు పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల డ్రస్ కోడ్ సంప్రదాయ బద్ధంగా ఉండాలన్నారు. ఎక్కువ అలంకరణతో నిండైన దుస్తులు లేదా పొడవాట స్లీవ్‌లు అనుమతించ బడవన్నారు. అభ్యర్థులు విధిగా ఒరిజినల్ పాస్‌పోర్టు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, క్లాస్ 12 అడ్మిట్ కార్డు, ఛాయా చిత్రంతో ప్రభుత్వం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డులు తీసుకురావాలనీ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విభజన హామీలపై ప్రధాని నోరు విప్పాలి

కడప మారుతీనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానివిభజన హామీలపై నోరు విప్పాలని వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు.

పింఛన్ల వెరిఫికేషన్‌లో వసతులు శూన్యం

కనీసం తాగునీరు ఏర్పాటు చేయని వైనం



ఆసుపత్రిలో నిలబడి ఉన్న వెరిఫికేషన్‌కు హాజరైన పింఛనుదారులు

పులివెందుల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గకేంద్రంలో పెన్షన్ల వెరిఫికేషన్ సందర్భంగా దివ్యాంగులకు కనీసం తాగునీరు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని సర్వజన ఆసుపత్రిలో దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ నిర్వహించారు వెరిఫికేషనుకు చుట్టుపక్కల మండలాల నుంచి దాదాపు 200 మందికి నోటీసులు జారీ చేయడంతో ఉదయం 10గంటలకే దివ్యాంగులు ఆసుపత్రికి చేరుకున్నారు. వెరిఫికేషన్ చేసే డాక్టర్లు కొంత మంది మధ్యాహ్నం 12గంటలైనా రాలేదు. వెరిఫికేషన్ కు వచ్చిన దివ్యాంగులకు అక్కడ కనీసం నీటి సౌకర్యం కల్పించలేదు. మజ్జిగ ప్యాకెట్లు కూడా అందించలేదు. అయినా పెన్షన్‌దారులు అక్కడే పడిగాపులు కాచి వెరిఫికేషను పరీక్షలు చేశారు. వెరిఫికేషన్ కేంద్రం వద్ద పెన్షన్‌దారులకు వసతులు కల్పించే బాధ్యత వైద్య ఆరోగ్యశాఖాధికారులకు ఉంది. కానీ వారు ఎవరూ పట్టించుకోలేదు. అయితే డీఆర్‌డీఏ శాఖకు సంబంధించి ఏ అధికారి కూడా వెరిఫికేషను కేంద్రం వద్దకు రాలేదు.ఆసుపత్రి వద్దనీరు, కూర్చో వడానికి సరైన వసతులు కానీ లేవని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు లేకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉండి అలసి పోయామని పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పెన్షన్ వెరిఫికేషను కోసం వచ్చే దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పులివెందుల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు.

రేపటి నుంచి పెద్దమ్మ దేవర

సింహాద్రిపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి సింహాద్రిపురంలో పెద్దమ్మ దేవర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు, గ్రామస్థులు తెలిపారు. 3వ తేదీ శనివారం ఉదయం 9గంటలకు దున్నపోతు ఊరేగింపు, అన్న ప్రసాద కార్యక్రమం, సాయంత్రం 4గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, అర్ధరాత్రి 12గంటలకు బలి కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం పోలి కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం కొత్తూరు చౌడేశ్వరి దేవి జ్యోతుల కార్యక్రమం ఉంటుందన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపుగా పెద్దమ్మ గడ్డ వరకు జరుగుతుందన్నారు. దాదాపు 80 ఏళ్ల తర్వాత జరిగే పెద్దమ్మతల్లి దేవరను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారు.

5 నుంచి ఏపీటీఎఫ్ నిరసన

కడప ఎడ్యుకేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల విద్యారంగంలో సంస్కరణల పేరుతో గందరగోళ పరిస్థితులను కల్పిస్తోందని, ఈ నేపథ్యంలో ఈనెల 5 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోలను పర్మినెంట్ చేయాలి

కడప మారుతీనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సీహెచ్‌వో శిబిరాన్ని గురువారం గుంటి వేణుగోపాల్ సందర్శించి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనరసమ్మ, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

కడప మారుతీనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాస్టర్. పి. మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. క్రిస్టియన్ మైనార్టీ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హిదాయతుల్లాను యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిసి బైబిల్‌ను బహూకరించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ సిబ్బంది డేవిడ్, మస్తాన్‌వలి, పాస్టర్లు, జయరాజు, రమేష్‌బాబు, రవితేజ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కడప ఎడ్యుకేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ మైక్రోబయాలజీ అధ్యాపకుడు డాక్టర్ శివప్రసాద్ కుటుంబానికి విశ్వవిద్యాలయ సహచర అధ్యాపకులు, ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని అందించారు. శివప్రసాద్ ఇటీవలే గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పిల్లలకు సాయం గా వైవీయూలోని అధ్యాపకులు, ప్రిన్సిపాల్ స్వచ్ఛందంగా రూ.52వేలు సమకూర్చారు. శివప్రసాద్ కుమార్తె బి.వెంకటశివమనోజ్ఞ పేరిట వైవీయులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఫిక్స్ డిపాజిట్ చేసి ఆపత్రాలను మనోజ్ఞ, ఆమె తల్లి ఎం. ప్రతిమకు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో చెత్త రహిత నగరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మాధవి, టీడీపీజిల్లా అధ్యక్షడు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛ కడపనిర్మాణంలో భాగంగా మన కడప - స్వచ్ఛ కడప కార్యక్రమాన్ని 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది, డివిజన్ కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

వేంపల్లె ఈఓగా రామసుబ్బారెడ్డి

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించి గాడిలోపెట్టేందుకు అన్నిచర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ పరిపాలన అధికారి ఖాదర్‌బాష పేర్కొన్నారు. వేంపల్లెలో ఈఓ లేకపోవడం వల్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా పంచాయతీ పరిపాలన అధికారి ఖాదర్‌బాష, వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. సర్పంచు ఆర్.శ్రీను, నూతన ఈఓ రామసుబ్బారెడ్డి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాగా వేంపల్లె ఈవోగా చిట్వేలిలో పనిచేస్తున్న రామసుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.



హెచ్‌టీ పత్తిపై కత్తి

- ఆదిలోనే కట్టడికి కసరత్తు
- వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా



ప్రొద్దుటూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏటా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా పత్తి రైతులను వివిధ కంపెనీలు నిండా ముంచుతున్నాయి. జిల్లాలో పత్తిసాగును ఆసరాగా చేసుకుని వ్యాపారులు కల్తీ విత్తనాలతోపాటు హెచ్‌టీ విత్తనాలను అంటగడుతున్నారు. ఈ ఏడాదికి సంబంధించి గత వారం రోజులుగా వ్యవసాయశాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెర్బిసైడ్ టోలరెంట్ (హెచ్‌టీ పరీక్ష) పత్తి విత్తనాల నాణ్యత, ప్రమాణాల పరీక్ష చేపట్టారు. హెచ్‌టీ టెస్ట్ పరీక్షించగా నెగిటివ్ (హెచ్‌టీ జన్యు లేకుండా కేవలం కంట్రోలైన్) మాత్రమే కనిపిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ర్యాండంగా తనిఖీలు చేపట్టి ధ్రువీకరణలు చేస్తున్నారు.

పత్తి రైతుకు ఒకవైపు ప్రతికూల వాతావరణం, తెగుళ్లతో అష్టకష్టాలు పడి సాగు చేస్తే చివరకు ధర లేక నష్టాలు తప్పడం లేదు. విత్తు నాటిన మొదలు నుంచి సుమారు అయిదు నెలలపాటు సాగే ఈ పంట మూడుసార్లు దిగుబడినివ్వగా పంటను రక్షించుకునేందుకు పురుగుల మందులను చల్లుతూ, కాపాడుకుంటూ చివరికి దిగుబడి చేతికందాక సరైన మద్దతు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పైగా బ్రాండ్ల పేరుతో కొంతమంది వ్యాపారులు ఎమ్మార్పీ ధరలను పెంచడంతో రైతులకు భారంగా మారింది. 475 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర గత ఏడాది రూ.864 ఉండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 901 రూపాయలకు ధర పలుకుతోందని రైతులు వాపోతున్నారు.

ఏటా తగ్గుతున్న సాగు

అష్టకష్టాలు పడి చీడ, పురుగుల భారీ నుంచి తప్పించి చివరకు దిగుబడి వచ్చినా పంటకు సరైన మద్దతు ధర లేక జిల్లాలో పత్తి సాగు ఏటా గణనీయంగా పడిపోతోంది. 2023 సంవత్సరంలో 22 వేల హెక్టార్లకుపైగా సాగైన పత్తి 2004 సంవత్సరంలో 13వేల హెక్టారులకు పడిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 13వేల హెక్టార్ల మేర పంట సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని నల్లరేగడి ప్రాంతాలు అయిన వేముల, వేంపల్లె, రాజుపాళెం, పులివెందుల, వల్లూరు, వీరపునాయునిపల్లె, పెద్దముడియం, కమలాపురం, తదితర మండలాల్లో రైతులు పత్తి సాగుకు సమాయత్తం అవుతున్నారు. నీటి లభ్యత, తొలకరి వర్షాల నేపథ్యంలో సాగును ప్రారంభించనున్నారు.

కలుపు నివారించవచ్చని..

హెచ్‌టీ పత్తి పొలంలో వేస్తే కలుపు నివారణ మందులు చల్లడానికి వెసులుబాటు ఉంది. కూలీలతో కలుపు తీయించే అవసరం ఉండదు. దీని వలన పర్యావరణానికి అనేక సమస్యలు వస్తుండడంతో ప్రభుత్వం నిషేధించింది. అనుమతి లేకపోయినా కొందరు రైతులు కలుపు సమస్య తగ్గుతుందని, దీనిపై మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. పత్తి విత్తనాలు నాటడం పూర్తయ్యే వరకు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు కూడా తనిఖీలు చేసేలా అన్ని మండలాలకు పరీక్షా కిట్లను అధికారులు అందజేస్తున్నారు. హెచ్‌టీ పత్తి సాగు కట్టడికి వ్యవసాయ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది.



విత్తనాలకు హెచ్‌టీ పరీక్ష చేస్తున్న అధికారులు

ఆదిలోనే కట్టడికి కసరత్తు

ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పత్తి సాగులో హెచ్‌టీ కలిగిన పత్తి విత్తనాలు రైతులకు అందకుండా వ్యవసాయశాఖ అప్రమత్తం అయింది. హెచ్‌టీ పత్తి విత్తనాల ఉత్పత్తి సాగు, అమ్మకాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించిన సంగతి తెలిసిందే. వీటి సాగు వలన పర్యావరణానికి హాని కలుగుతుందని గుర్తించి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. విత్తనాల తయారీ, సరఫరా సమయంలోనే అడ్డుకట్ట వేస్తే రైతులకు సరఫరా కాకుండా నియంత్రించవచ్చునని లక్ష్యంతో వ్యవసాయశాఖ ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలు చేయిస్తోంది. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాలో గత మూడు రోజులుగా ప్రత్యేక బృందాలు ఇన్‌స్టాంట్ కిట్లను ఉపయోగించి వివిధ కంపెనీల పత్తి విత్తనాలను పరిశీలిస్తున్నారు. వేంపల్లె, పులివెందుల, ముద్దనూరు, జమ్మలమడుగు, రాజుపాళెం, దువ్వూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు మండలాల్లో వివిధ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. 25 రకాల పత్తి విత్తనాలను పరిశీలించగా హెచ్‌టీ పత్తి లేదని తేలింది. విత్తన పంపిణీ చేసే కంపెనీల గోదాములు, కంపెనీదారులు, రీటైల్ డీలర్లు, దుకాణాలు, తదితర వాటిల్లో తనిఖీలు చేస్తున్నారు. అక్కడక్కడ నమూనాలను సేకరించి హెచ్‌టీ జన్యు పరీక్షలు చేసి హెచ్‌టీ ఉందా? లేదా? అని నిర్ధారిస్తున్నారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు



విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

వల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా పుష్పగిరి కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఈ పోటీల్లో కడపకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.60116ల బహుమతి అందుకున్నారు. అనంతపురం జిల్లా కొత్తపల్లెకు చెందిన గౌతంరెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచి బహుమతి కింద రూ.40116లు గెలుచుకోగా, అనంతపురం జిల్లా వరదాయపల్లె శ్రీరాములుకు చెందిన ఎద్దులు మూడో బహుమతి రూ.20116, వల్లూరు మండలం జ్యోతువారిపల్లె చెందిన వెంకటరమణారెడ్డి ఎద్దులు నాలుగో బహుమతి రూ.10,116లు గెలుచుకున్నాయి. ఎడ్ల యజమానులకు వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. అలాగే ఐదు నుంచి ఎనిమిది స్థానాలకు వరకు నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు ఇచ్చారు. కాగా, వచ్చే సంవత్సరం బండలాగుడు పోటీల్లో విజేతకు వల్లూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన టీడీపీ నేత రామసుబ్బారెడ్డి రూ.లక్షా116లు అందజేస్తామని తెలపడంతో అక్కడున్న ఎద్దుల యజమానులు, పోటీలు తిలకిస్తున్న ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మెడతోటి మూర్తి మృతదేహం

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాచుపల్లె వద్ద కడప - కర్నూలు జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడతోటి మూర్తి (18) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక కొత్తగాంధీనగర్‌కు చెందిన మెడతోటి మూర్తి తమ సొంత పనుల నిమిత్తం చిన్నమాచుపల్లె వద్దకు వెళ్లి పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి చెన్నూరు వైపు వేగంగా వస్తున్న ట్రాక్టరు ఢీకొంది. దీంతో ఆ యువకుడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటస్థలానికి చేరుకుని శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తలరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని.. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు బ్రహ్మంసాగర్‌లో వ్యక్తి...



బ్రహ్మంసాగర్‌లో నుంచి వెలికితీసిన మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మే 1 (ఆంధ్ర జ్యోతి): బ్రహ్మంసాగర్ రిజర్వాయరులో ప్రమాదవశాత్తు సుబ్బాచారి రాజగోపాల చారి (65) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా హోసోరు టౌనుకు చెందిన రాజ గోపాల చారితో పాటు 25మంది టూరిస్టులు బుధవారం బ్రహ్మంగారి మఠం వచ్చారు. దైవదర్శనం అనంతరం విహార యాత్రకు బ్రహ్మంసాగర్ వద్దకు వెళ్లారు. రాజ గోపాలచారి నీటిలో స్నానం చేయడానికి దిగడంతో గల్లంత య్యాడు. అతని కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఉదయం నుంచి గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది కలిసి వెతికి మృత దేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రిమ్స్ వద్ద గుర్తు తెలియని మహిళ...

కడప క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన మహిళ వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మహిళ వివరాలు తెలిసిన వారు 9121100523, 9121100524కు ఫోను చేసి తెలుసకోవచ్చన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీ వద్ద ఉంచినట్లు తెలిపారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

- 61 గ్రాముల వెండి, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం



పట్టుబడ్డ దొంగల ముఠాను చూపుతున్న రాయచోటి అర్బన్ పోలీసులు

రాయచోటిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాయచోటి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వరుస దొంగతనాల నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రాయచోటి అర్బన్ పోలీసులు అంతర్ జిల్లాల దొంగల ముఠాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 61 గ్రాముల వెండి వస్తువులతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్ సీఐ బీవీ చలపతి వివరాలను వెల్లడించారు. రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం పెద్దరామిరెడ్డిగారిపల్లెకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గడ్డం బసిరెడ్డి ఇంట్లో గత నెల 16వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో కొంత మంది గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి బంగారు, వెండి వస్తువులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్ జిల్లాల దొంగల ముఠాకు చెందిన అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందియ బోయరాజు, ఉప్పొంక గ్రామానికి చెందిన బొట్ట నారాయణ అలియాస్ దశరథ, గుమ్మగట్ట మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఎరుకుల రామకృష్ణ, ఎరుకుల రమేశ్, అనంతపురం టౌన్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బోయ సంజీవ్‌కుమార్, ఉరవకొండ మండలం చిన్నముస్తూరు గ్రామానికి చెందిన నేసే సోమశేఖర్ అలియాస్ సోములను గురువారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడం గమనించి రాయచోటి అర్బన్ ఎస్ఐ అబ్దుల్ జహీర్, జిల్లా క్రైమ్ పార్టీ ఎస్ఐ రామక్రిష్ణారెడ్డిలు సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి వెండి వస్తువులను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు. వీరి ముఠాలో పవన్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు.

గండి ఆలయాన్ని ప్రారంభించకపోవడం విచారకరం

- ఎంపీ అవినాశ్‌రెడ్డి

చక్రాయపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు గండి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 80శాతం పనులు పూర్తి చేశారని, అయితే చిన్నచిన్న పనులు కూడా పూర్తి చేసి టీడీపీ ప్రభుత్వం ఆలయాన్ని ప్రారంభించకపోవడం విచారకరమని ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని కుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గండి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేసరి, రాజారమేష్‌లు పూజలు చేయించి సన్మానించారు. అనంతరం గండి ఆలయాన్ని పరిశీలించి ఆలయాన్ని ప్రారంభించకపోవడానికి కారణాలేమిటని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిత్యాన్నదాన పథకం కూడా బాగా జరుగుతోందా అని వాకబు చేశారు. ఏపీ టూరిజం కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జడ్పీటీసీ శివారెడ్డి, ఎంపీపీ మాధవి, వైసీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, హరి, జనార్దన్‌రెడ్డి, గంగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం పొడిగింపు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ (పీఏఈసీఎస్)ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ ఆర్టీ నెంబర్ 229ని జారీ చేసింది. వీరపునాయునిపల్లె మండలం గడ్డంవారిపల్లె సొసైటీకి కె.నాగరత్నమ్మ, గోనుమాకులపల్లెకు యూసీ వెంకటసుబ్బయ్య, కె.అగ్రహారం సొసైటీకి వి.వేణుమాధవరెడ్డి, దువ్వూరుకు ఎ.రాజశేఖర్, మైదుకూరు ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఎం.బ్రహ్మానందరెడ్డిని కొనసాగించారు. తాళ్లప్రొద్దుటూరు ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఇప్పటి వరకు ఉన్న ఎంపీ ప్రభాకర్‌రావు స్థానంలో ఎ.రాజశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థికి బంగారు పతకం



ఉదయ్‌శంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


రాజంపేటటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థి ఎస్. ఉదయ్‌శంకర్ డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మురుగన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదు సమీపంలోని నల్గొండలో గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో డిస్కస్‌త్రోలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాజంపేట కేంద్రీయ విద్యాలయం పదో తరగతి విద్యార్థి ఉదయ్‌శంకర్‌కు బంగారు పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయం వ్యాయా మ ఉపాధ్యాయుడు రాహుల్‌కుమార్ ఆ విద్యార్థిని అభినందించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అదృశ్యం

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఒంగోలు క్యాంపస్‌లో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. నాలుగురోజుల క్రితం ట్రిపుల్‌ఐటీ నుంచి ఆ విద్యార్థిని వెళ్లిపోయినట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు ఆర్కేవ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ తిరుపాల్‌నాయక్ విద్యార్థిని కోసం గాలిస్తున్నారు. గుంటూరుకు చెందిన విద్యార్థిని వేరొక విద్యార్థినికి చెందిన సెల్‌ఫోన్ తీసుకెళ్లడంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో భయాందోళనకు గురైన గుంటూరుకు చెందిన విద్యార్థిని నాలుగురోజుల క్రితం ట్రిపుల్‌ఐటీ నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లకపోవడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న కారు.. తండ్రీకొడుకులు మృతి





ఆసుపత్రిలో మృతి చెందిన సాధిక్

ముద్దనూరు మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని మునయ్యకోన సమీపంలో గురువారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో తండ్రీకొడుకులు మృతి చెందారు. పోలీసుల వివరాలమేరకు... కొండాపురం మండలం చౌటిపల్లెకు చెందిన హాజీ మహమ్మద్ (40) కుమారుడు సాధిక్ (4)తో ఉరుసు ఉత్సవానికి అత్తగారిపల్లె ఇంటికి జమ్మలమడుగుకు కుటుంబంతో వెళ్లాడు. సాయంత్రం చౌటిపల్లెకు తిరిగి బైకుపై వస్తుండగా మునయ్య కోన సమీపంలో ముద్దనూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బాలుడు సాధిక్ మృతి చెందాడు. హాజీ మహమ్మద్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ఎద్దల కొండ ఆలయంపై పిడుగుపాటు

- దెబ్బతిన్న దేవతామూర్తుల విగ్రహాలు



పిడుగుపాటుకు ఆలయ రాజగోపురం పైనుంచి కింద పడ్డ విగ్రహాలు

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నదీ ఒడ్డున ఎద్దలకొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపడింది. బుధవారం రాత్రి ఉరుము లు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఆలయ రాజగోపురంపై పిడుగు పడింది. దీంతో అక్కడ దేవతామూర్తుల, ఇతర శిల్పాలు దెబ్బతిని ముక్కలుగా కిందపడ్డాయి. ఈ విషయాన్ని అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తదితరులు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, పూజారి హరిప్రవీణ్‌లకు తెలిపారు. గురువారం ఉదయం ఆలయాన్ని సందర్శించిన ఈఓ, పూజారిలు పిడుగుపాటుకు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. కాగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆలయాన్ని సందర్శించి పిడుగుపాటుకు దెబ్బతిన్న గోపురాన్ని పరిశీలించారు. ఆలయ సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించాలని కోరారు.

కార్మిక హక్కులను రక్షించుకోవాలి

● నినదించిన కార్మిక సంఘాల నాయకులు ● ఘనంగా మేడే వేడుకలు ● పనిగంటలను పెంచి శ్రమదోపిడీ చేయవద్దంటూ భారీ ప్రదర్శనలు



ప్రొద్దుటూరులో టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరులో మే డే సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బైక్ మెకానిక్‌లు



జమ్మలమడుగులో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు , కార్మికులు

ప్రొద్దుటూరు/టౌన్/అర్బన్ మే 1 (ఆంధ్రజ్యోతి):కార్మికు ల హక్కులను పరిరక్షించాలంటూ కార్మిక సం ఘాల నాయకులు ప్రభుత్వాలను కోరారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా టీఎన్‌టీయూసీ పాటు పడుతుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్‌లు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ ప్రభుత్వం కార్మికుల భీమా సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాలు అమలయ్యేలా కృషి చేస్తుందన్నారు. అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వాల్మీకి బోయ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, నంద్యాల ఆనంద బార్గవరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, ,మాజీ పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు. కౌన్సిలర్ కమాల్, మాజీ కౌన్సిల్లర్ అంజి, నూరి, సిద్దయ్య, పాల్గొన్నారు. కాగా మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులకోసం పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం మేడే సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద, ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. మేడే సందర్భంగా పుట్టపర్తి సర్కిల్‌లో విద్యుత్తు కార్యాలయం వద్ద జిల్లా ప్రభుత్వ కార్యాలయం వద్ద, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద, పాత బస్టాండు వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, మధు, చైతన్య, నిర్మల, శ్రీను, నీలకంఠారెడ్డి, పీరా, రమణ పాల్గొన్నారు. మే డే సందర్భంగా బైక్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామేశ్వరంలోని సాయిబాబా గుడి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కార్మికుల ఐక్యత చాటుకున్నారు. పట్టణంలోని వందల మంది బైక్ మెకానిక్లు ర్యాలీ లో పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో 139 మేడే వేడుకలను పురష్కరించుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు గంగిరెడ్డి జెండా ఎగురవేశారు. అలాగే పాత బస్టాండు ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహం పక్కన ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు దండు రవి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పట్టణ నాయకుడు ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలని లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని ప్రభుత్వ సంస్థలు ప్రైవేటుపరం తగదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్మిక నాయకులు ప్రతాప్, గంగాధర్, రాజేష్, నాగేంద్ర, లాల్‌బాష, సుబాన్, సంతోష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కుమారి, సంపూర్ణ, ఉషా పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో దాసరి విజయ్, ఆటో కార్మికులు జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు.

ఎర్రగుంట్లలో: కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 8 గంటల పని విధానం కొనసాగించాలని ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా ఎర్రగుంట్లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ 14గంటలు పనిచేయించుకుంటూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అంతార్జాతీయ కార్మిక సంస్థ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని చెప్పినప్పటికి అమలు చేయడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుబ్బారెడ్డి, మంజుల, చాంద్‌బాషా, డి.రమణారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో: మైదుకూరులో మే డే దినోత్సవాన్ని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి శివరాం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక మున్సిపాలిటీ వద్ద, ఆర్‌టీసీ బస్టాండ్ ఆవరణలో ఆటో యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పీరయ్య, ఖాదర్‌బాషా,మాబు హుసేన్, చిన్న, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురష్కరించుకుని మైలవరం నాలుగు రోడ్ల కూడలిలో గురువారం సీఐటీయూసీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణ, శ్రీనివాసులు, సీపీఐ కార్యదర్శి కృష్ణ, మునిరెడ్డి, ఏపీచేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు శివనారాయణ, మండల నేత కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో: మేడే వేడుకలను కొండాపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు పతాకావిష్కరణ చేసి, కేక్ కట్‌చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాన పనికి సమానవేతనం కల్పించాలని, వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కోరారు. కార్య క్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వెంకటరమణ, మనోహర్‌బాబు, సుబ్బారావు, తారాదేవి వైవీసుదర్శన్‌రెడ్డి, వెంకటేష్, రామాంజనేయులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో: మేడే వేడుకలను బద్వేలు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎనిమిది గంటల పని హక్కు , పరిరక్షణ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణు, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: మేడే వేడుకలను పోరుమామిళ్లలో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్లలోని మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఎస్టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణారెడ్డిలు మాటాడుతూ కార్మికుల హక్కులు కాలరాసే నాలుగు లేబరు చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీబస్టాండు ఆవరణలో భోజన వసతి కల్పించడంతోపాటు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్, కేశవ, జాకోబ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు పీరయ్య, ఎస్టీయూ నాయకులు బాలరాజు, సుబ్రమణ్యం, మహిళా సంఘం నాయకులు విశ్వాసమ్మ, బాలమ్మ పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం తదితర చోట్ల ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి గౌసియా బేగం, నాయకులు మేరీ ఓబులమ్మ, విద్యుత్ కార్మికులు ఈశ్వర్, హుసేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అట్లూరులో: అట్లూరు మండలంలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక సంఘం నాయకులు రమణ, చాంద్‌బాషా, దుర్గమ్మ, బాలమ్మ కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించిన రోజే మేడే అని కొనియాడారు. మండలంలో వలసపాలెం, దేవనగర్, మన్యంవారిపల్లెల్లో మేడేను ఘనంగా నిర్వహించారు.

కలసపాడులో: కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం కలసపాడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం అనారోగ్యంతో మృతిచెందిన మండల సీపీఎం నాయకుడు ప్రవీణ్‌కు నివాళ్ళుర్పించి మౌనం పాటించారు. గురయ్య, రాజు, నాగూర్‌వలి, హుసేన్‌పీర తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో ఏఐటియుసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



ఎర్రగుంట్లలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కొండాపురంలో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆగిన ఉత్తర కాలువ పూడికతీత పనులు

● బందోబస్తు ఇవ్వాలని డీఎస్పీకి పంచాయతీ కార్యదర్శి వినతి



కాలువ కట్ట సమీపంలోని మైలవరం ఉత్తర కాలువ

ప్రొద్దుటూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని గోపవరం పంచాయతీ మీదుగా వెళుతున్న మైలవరం ఉత్తర కాలువ ఆక్రమణ, కాలువ పూడికల తీత పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరైనప్పటికి స్థానికుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుండడంతో పనులు సాగలేదు. ఈ మేరకు గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ డీఎస్పీ భావనను కలిసి అభివృద్ధి పనులు సాగేందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మేరకు డీఎస్పీకి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని చౌటపల్లె వద్ద ఉన్న డైమండ్ విల్లాస్ మొదలుకుని హాపీహోమ్ బైపాస్ చివరి వరకు మొత్తం 3.5 కి.మీ. మైలవరం ఉత్తర కాలువ పూడికతీత పనులతోపాటు ఇరువైపుల గురైన ఆక్రమణలు తొలగింపునకు సుమారు రూ.12 లక్షల పంచాయతీ నిధులు మంజూరయ్యాయి. ప్రారంభంలో కొంతమేర పనులు చేపట్టినా స్థానిక కాలువ కట్టవాసులు ఆక్రమణలు తొలగించేందుకు ప్రతిఘటిస్తూ పనులను ఆపివేస్తూ వచ్చారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదేశిస్తున్నా స్థానికుల నుంచి వస్తున్న ప్రతిఘటనల నేపథ్యంలో కాలువ అభివృద్ధి పనులు జరిపేందుకు తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులు, రూరల్ సీఐ బాలమద్దిరెడ్డిని కోరారు. దీంతో ఆయన సూచన మేరకు ఈ విషయాన్ని డీఎస్పీ భావన దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. గోపవరం కార్యదర్శి రామకృష్ణ డీఎస్పీ భావనను కలిసి బందోబస్తును కోరారు. విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి తగిన బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారని చెప్పారు.

ఈదురు గాలులకు నేలవాలిన అరటితోటలు



ఈదురు గాలులకు బాలాయపల్లెలో పడిపోయిన అరటితోటలు

కాశినాయన మే20(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు బాలాయపల్లె అరటి రైతులకు శాపంగా మారాయి. అడుగంటిన భూగర్భ జలాలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ అతికష్టంమీద కాపాడుకుంటూ వచ్చిన అరటి తోటలు ఒక్క గాలి దెబ్బకు నేలవాలిపోవడంతో రైతులు అబోదిబోమంటున్నారు. లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన అరటి తోటలు గాలికి తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రభుత్వమే అరటి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతఉన్నారు. గురువారం నాటి గాలికి ఉప్పలూరులో కరెంట్ స్తంభాలు పడిపోవడంతో కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కులగణనపై కేంద్ర క్యాబినెట్ తీర్మానం హర్షణీయం



మాట్లాడుతున్న బొర్రా రామాంజనేయులు

ప్రొద్దుటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) :జనగణనలో బాగంగా కులగణన చేపడతామని కేంద్ర క్యాబినెట్ తీర్మాణం చేయడం హర్షణీయమని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు హర్షం ప్రకటించారు. గురువారం స్థానిక బీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దేశంలో దశాబ్దాలుగా బీసీలు కులగణన చేపట్టాలని పోరాడుతున్నారన్నారు. దేశంలో ఐదు కీలక రాష్ట్రాలకు ఎన్నికలు ఉన్న సందర్భంగా బీజేపీ చేసిన ఈ క్యాబినెట్ తీర్మాణంను ప్రాధాన్యత ఉందన్నారు. కులగణన చేపట్టి బీసీ జనాభాను తేల్చాక చట్టసభలతో పాటు విద్య ఉద్యోగ రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం ఇచ్చే రిజర్వేషన్‌లో బీసీ మహిళల కోటా తేల్చి చట్టం చేయాలని బీసీలకు అప్పుడే నిజమైన స్వాతంత్రం లభించినట్లు అవుతుందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు నడుస్తున్న బీసీ సంఘాల ఉద్యమ నేతలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి చాబోలు దేవేంద్రుడు, కోశాధికారి సంటెన్న, ఉపాధ్యక్షుడు జీసీ పుల్లయ్య, పోసా ఆదినారాయణ, మల్లికార్జున, బత్తల శ్రీను, సంగటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టడం అభినందనీయం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బద్వేలు, మే 1 (ఆంధ్రజ్యోతి):జనగణనలో కులగణన చేయాలని కేంద్ర క్యాబినేట్‌లో ప్రధాని మోదీ ఆమోదించి ప్రకటించ డాన్ని హర్షిస్తూ గురువారం ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు దేశాన్ని పాలించిన ఏ ప్రభుత్వాలు కూడా కులగణన చేపట్టక పేద, బడుగు, బలహీనవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయన్నారు. బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాజ్యసభలో కులగణన చేయాలని ప్రశ్నించడం వలననే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుబాన్‌బీ, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు రమణ, దళిత నాయకులు మునెయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల పట్టివేత



ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టిన కోతులను బంధించిన దృశ్యం

ప్రొద్దుటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పబ్లిక్ హెల్త్ శానిటరీ ఇన్స్పెక్టర్ నూర్ బాషా ఆధ్వర్యంలో గురువారం కోతులను పట్టుకున్నారు. వాటిని బద్వేలు అటవీ ప్రాంతంలో వదలివేస్తామని శానిటరీ అధికారులు తెలిపారు. గత నెల జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కోతులున్నాయని వాటిద్వారా రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ కమిషనర్ మల్లికార్జునను కోతుల బెడద తీర్చాలని ఆదేశించారు. ఆసుపత్రిలోనే కాకుండా వైఎంఆర్‌కాలని, వసంతపేట ఏరియాలో సైతం కోతులు పట్టినట్లు నూర్‌బాషా తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలుటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా గురువారం బద్వేలు మున్సిపల్ కార్మికులు వారి సమస్యలను పరిష్కరించాలంటూ టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డికి వితని పత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా కార్మికులు వెట్టిచాకిరీ చేస్తూ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్‌వారికి ఉద్యోగాలు కల్పించాలని రితేష్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన రితేష్‌కుమార్‌రెడ్డి ఈ విషయాన్ని ఇన్‌చార్జిమంత్రి సబిత దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఏకోపల్లెలో గంగమ్మ జాతర

దువ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామంలో ఈనెల 2, 3, 4 తేదీల్లో గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2న గ్రామ దేవతలకు పూజా కార్యక్రమం, 3న గంగా కాటమరాజుకథ ఏర్పాటు, 4న గ్రామంలో బోనాలు తీయడం, జాతర చేయడం జరుగుతుందని చెప్పారు.

అభియోగాలపై విచారణ

దువ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె, చిన్నసింగనపల్లె ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన అబియోగాలపై గురువారం విచారణ చేశారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రామకృష్ణయ్య, ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ ఇందిరాప్రియాంక ఈ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులు, బాధితులు విడివిడిగా అధికారుల ఎదుట హాజరై వాగ్మూలం ఇచ్చారు. వాటిని విచారణ అధికారులు నమోదు చేశారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు జైలుశిక్ష

గోపవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన వ్యక్తులకుజైలు శిక్ష విధించడం జరిగిందని బద్వేలు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలునడుపుతున్న ఇరువురిని బద్వేలు ఏజేసీజే కోర్టుకు తరలించామన్నారు. ఇందులో నెల్లూరు జిల్లాకు చెందిన నల్లమారు లక్ష్మిరెడ్డికి 13 రోజులు జైలుశిక్ష అదేవిధంగా బద్వేలు మండలానికి చెందిన వడ్డె చిన్న అనే వ్యక్తికి మూడు రోజులు జైలుశిక్ష గౌరవ ఏజేసీజే కోర్టు జడ్జి ముకేశ్‌కుమర్ విధించి బద్వేలు సబ్ జైలుకు పంపారు. కాగా మద్యం తాగి వాహానాలను నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రూరల్ సీఐ నాగభూషణ్ తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రొద్దుటూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ పేర్కొన్నారు. గురువారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. సమ్మర్‌క్యాంప్‌లో స్పోకన్ ఇంగ్లీషు పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలసిన డీసీసీబీ చైర్మన్



సీఎంను కలసిన డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మే (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడును నూతనంగా ఎన్నికైన డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి కొద్దిసేపు ఆయనతో చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డిని అభినందించారు.

షర్మిలను గృహ నిర్బందం చేయడం దారుణం

ప్రొద్దుటూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను గృహ నిర్బంధం చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాష రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ఎంతమాత్రం అభివృద్ధి జరిగిందో పరిశీలించడానికి వెళ్లాలనుకున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై పోలీసులు ఆంక్షలు విధించి హౌస్ అరెస్టు చేయడం దారుణమన్నారు.

వైభవంగా కాశినాయన ఆలయ వార్షికోత్సవం

కొండాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో వెలసిన కాశిరెడ్డినాయన ఆలయంలో గురువారం రెండవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని గణపతి, అన్నపూర్ణదేవి, కాశిరెడ్డినాయన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నదానం, అనంతరం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు భారీగా తరలివెళ్లిన కూటమి నేతలు



మూడు బస్సుల్లో అమరావతికి తరలివెళుతున్న కూటమి నేతలు, తదితరులు

ఎర్రగుంట్ల, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ సభకు ఎర్రగుంట్ల నుంచి భారీగా నాయకులు తరళి వెళ్లారు. ఎర్రగుంట్ల మండల ఎన్‌డీఏ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు బస్సుల్లో మహిళలు, అధికారులు, కూటమి కార్యకర్తలు భారీగా తరళివె ళ్లారు. గురువారం రాత్రి స్థానిక బస్టాండు ఆవరణం నుంచి ఈ బస్సులకు తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీవో వెంకటరమణయ్య, కమిషనర్ శేషఫణి, తదితరులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ప్రధాని సభకు వెళ్లడం ఆనందంగా ఉందని మహిళలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక వాహనాల్లో బారీ ఎత్తున తరళివెళ్లారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం అమరావతికి మైదుకూరు నుంచి బస్సులు బయలుదేరాయి. అమరావతి పునఃనిర్మాణ ప్రారంభ వేడుకలకు శుక్రవారం ప్రధానమంత్రి మోదీ రానున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మైదుకూరు నుంచి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

ఖాజీపేటలో: మండల పరిధి నుంచి మూడు బస్సుల్లో కార్యకర్తలు తరలి వెళ్లినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్సులు బయల్దేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొగ్గుల చంద్ర ఓబుళరెడ్డి, రవీంద్రారెడ్డి, హరినాథరెడ్డి, పుల్లయ్యనాయుడు, నంద్యాల సుబ్బయ్య, కృష్ణారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయనలో: అమరావతిలో శుక్రవారం నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు మండలం నుంచి ప్రత్యేక బస్సులో పలువురు టీడీపీ నేతలు, మహిళా కార్యకర్తలు తరలివెళ్లారు. ఆమేరకు వారికోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సును గురువారం రాత్రి కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

దువ్వూరులో: దువ్వూరు నుంచి గురువారం రాత్రి అమరావతికి రెండు బస్సులు తరలి వెళ్లాయి. ప్రధాని నరేంద్రమోదీ అక్కడికి వస్తున్న నేపథ్యంలో సభను విజయవంతం చేసేందుకు వెళ్లారు. అందులో భాగంగా దువ్వూరు నుంచి 70 మంది ప్రజలతో కూడిన బస్సులు వెళ్లాయి.

అమరావతికి బయల్దేరిన డ్వాక్రా మహిళలు

బ్రహ్మంగారిమఠం, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా విచ్చేస్తున్న సందర్భంగా బ్రహ్మంగారమఠం మండలం నుంచి డ్వాక్రా మహిళలు, అసిస్టెంటు అమరావతికి బయల్దేరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్యామలాదేవి, ఎంపీడీవో వీరకిశోర్, తహసీల్దారు దామోదర్‌రెడ్డి వెలుగు ఏపీఎం శివప్రసెద్, డిప్యూటీ తహసీల్దారు సాంబశివారెడ్డి వెలుగు సీసీలు బాలయ్య భాస్కర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

పోరుమామిళ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుగుగంగ కాల్వ సమీపంలో ఓ గుర్తు తెలియని శవం లభ్యమైంది. గురువారం ఆ చుట్టుపక్కల వారు కొందరు అక్కడ కుళ్లిపోయిన శవం ఆనవాల్లను పోరుమామిళ్ల పోలీసులకు సమాచా రం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాసథలానికి వెళ్లి పరిశీలించగా సమీపంలో ఓ వేపచెట్టుకు చీరతో ఉరి వేసుకున్న ఆనవాల్లు ఉండడాన్ని గుర్తించారు. శవాన్ని అడవి జంతువులు లాగి కిందపడేసినవని నిర్ధారించారు గుర్తు పట్టలేనిస్థితిలో ఉండిపోయింది. సంఘటన జరిగి దాదాపు 20 రోజులు ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. శవంపై ఎర్రనిరంగు షర్టు, గళ్లలుంగీ ఉండడాన్ని గుర్తించారు. విషయాన్ని సీఐ శ్రీనివాసులు పాత్రికేయులకు తెలిపారు.వాటిని గుర్తు పట్టిన వారు ఎవరైనా ఉంటే పోరుమామిళ్ల పోలీసు స్టేషన్‌లో 9121100631, 9121100630 కు ఫోను చేయాలని తెలిపారు. గురువారం ఈ సంఘటన వైరల్‌గా మారడంతో పోలీసు సిబ్బంది అంతా సంఘటనా స్థలంలో జల్లెడ పట్టి విచారణ జరిపారు.అక్కడ రాబడిన సమాచారాన్ని పాత్రికేయులకు తెలిపారు.